తడిసిన ప్రతి గింజ కొంటాం

- ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన
- అండగా ఉంటామని రైతులకు హామీ


ముచ్చింతాలలో నీళ్లలో నానుతున్న వరి పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, అధికారులు, నాయకులు


కంచల గ్రామంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్నదాతలకు భరోసా ఉంటుందని, తుపాను కారణంగా తడిసిన ప్రతిగింజను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తుందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. రైతులు, అధికారులతో కలిసి గురువారం ఆయన తుపాను ప్రభావంతో నష్టపోయిన పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు గ్రామాల్లో నష్టపోయిన పంటపొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, జగనన్న ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ధాన్యం కొనుగోలుపై ఇప్పటికే మిల్లర్లతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. చరిత్రలో పంట నష్టపోయిన రైతులకు అదే సీజనలో నష్టపరిహారం అందించిన ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పంట నష్టపరిహారం అందక రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వంలో రైతు ఆత్మహత్యలు లేవని, వ్యవసాయం పండుగలా సాగుతోందని వివరించారు. గతంలో ఇన్‌పుట్ సబ్సిడీ అనేది కేవలం నామమాత్రంగా ఉండేదని, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు నష్ట పరిహారం కొద్దిరోజుల్లోనే అందజేస్తున్నామని వివరించారు.పంటనష్టంపై ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. తుపాను నేపథ్యంలో ముఖ్యమంత్రి తీసుకున్న ముందస్తు చర్యల కారణంగా రాష్ట్రంలో ప్రాణనష్టం, ఆస్తినష్టం లేదన్నారు. పంటనష్టాన్ని గుర్తించే పనిలో అధికారులు రైతుల నష్టాన్ని సక్రమంగా లెక్కించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముచ్చింతాల, అనిగండ్లపాగు సర్పంచ్‌లు బి. జ్యోతిబ్రహ్మం, జక్కులూరి రాంబాబు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, వ్యవసాయ ఏడీ సి.భవాని, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, పార్టీ జిల్లా సహాయక కన్వీనర్ గుజ్జర్లపూడి వర్థీకాసులు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, గ్రామ పార్టీ అధ్యక్షులు నూకవరపు శ్రీనివాసరావు, గంగూరి ప్రసాద్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య పాల్గొన్నారు.

ప్రతి రైతును ఆదుకుంటాం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటుందని..ఎవ్వరూ అధైర్యపడొద్దని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని కంచలలో తుపాను ధాటికి దెబ్బతిన్న అరటి, జామ, వరిపంట పొలాలను గురువారం ఆయన పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. చందర్లపాడు మండలంలోని పొక్కునూరు, కాసరబాద, కొడవటికల్లు, ఉస్తేపల్లి గ్రామాల్లోని వరి, మిర్చి పంటలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ రైతులు అధైర్యపడొద్దని అన్నిరకాలుగా అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో నీటిపాలు కావడం బాధకరమన్నారు. తడిసి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేలా కృషిచేస్తానన్నారు. ముఖ్యంగా గతంలో వర్షాలు, వరదలు సంభవించిన సమయంలో సైతం ఏ సీజన్‌లో పంట నష్టపోతే.. అదే సీజన్‌లోనే పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీని అందించిన ప్రభుత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రైతులందరినీ తప్పకుండా ఆదుకుంటామని తెలిపారు.

పారదర్శకంగా నష్టం అంచనాలు..

తుపాను కారణంగా నష్టపోయిన రైతుల పంట నష్టం అంచనాలను పారదర్శకంగా తయారుచేసి రైతులకు అండగా ఉండాలని ఇప్పటికే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలను అధికారులంతా తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సూచించారు. పంట నష్టం అంచనాల నమోదులో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చలమల మధుసూధనరావు, రామిరెడ్డి సీతయ్య, వైఎస్ఎన్ ప్రసాద్, కొమ్మినేని మహేంద్ర, నెలకుదిటి శివనాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, చల్లా శివయ్య, పలువురు రైతులు ఉన్నారు.


పెనుగంచిప్రోలులో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను, ఏడీఏ భవాని


చందర్లపాడులో మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

17మంది రేషన్ డీలర్లకు నియామక పత్రాలు



నందిగామ టౌన్: రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో నూతనంగా ఎంపికైన 17మంది రేషన్ డీలర్లకు తన కార్యాలయంలో గురువారం ఆయన నియామకపత్రాలు అందజేసి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ నందిగామ మండలం నుంచి నలుగురు, కంచికచర్ల మండలంలో ఆరుగురు, చందర్లపాడు మండలం నుంచి ఇద్దరు, వీరులపాడు మండలం నుంచి ఐదుగురు ఎంపికయ్యారని తెలిపారు. నూతనంగా ఎంపికైన డీలర్లు ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, నాయకులు పాములపాటి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆనందసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆనందసాయి ఆలయంలో షిర్డీ సాయిబాబాకు గురువారం ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా నక్షత్రహారతి, స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు సతీష్‌శర్మ ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్వర్టుల నిర్మాణం కోరుతూ వినతిపత్రం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు వద్ద కూచివాగు, దూళ్లవాగుపై చప్టాల ఎత్తు పెంచి కల్వర్టులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం కోరారు. వరద ప్రాంతాలను పరిశీలించడానికి వచ్చిన ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానును కూచివాగు వద్ద గురువారం ఆమె కలిసి ఈ మేరకు ఓ వినతిపత్రం అందజేశారు. చప్టాల వద్ద వరద నీరు పోటీసి పొలాలపై ప్రవహిస్తుండటంతో ఏటా నష్టపోతున్నామని తెలియజేశారు. అనంతరం ఉదయభాను స్పందిస్తూ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుమాటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్ మియా, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, గ్రామనాయకులు గంగూరి ప్రసాద్, గింజుపల్లి శ్రీనివాసరావు, వూట్ల లక్ష్మయ్య, పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని ఒకటోవార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా కల్వర్టు ఫాగింగ్, ఎబేట్ పిచికారీ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ ఆనందకుమార్ బాధ్యతల స్వీకరణ



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ఎస్ఐగా డి.ఆనందకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ బీవీ రామారావు బదిలీపై స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లగా ఆస్థానంలో విజయవాడ స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఆనందకుమార్ నియమితులయ్యారు. ఎస్ఐ ఆనందకుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఉదయభానును కలిసిన ఎస్ఐ ..

పట్టణ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ ఆనందకుమార్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాద పూర్వకంగా కలిశారు. సమర్ధవంతగా విధులు నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకోవాలని ఉదయభాను ఆయనకు సూచించారు.

ఖో - ఖోలో ఎల్‌బీఆర్‌సీఈ విద్యార్థుల ప్రతిభ



మైలవరం: జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజీయేట్ ఖో - ఖో టోర్నమెంట్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్‌బీఆర్ సీఈ) విద్యార్థులు ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ.. జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ ఖో - ఖో మెన్ అండ్ ఉమన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ ట్రయల్ ఈ నెల 3, 4 తేదీల్లో నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీలో జరిగాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూకే పరిధిలోని మొత్తం 28 కాలేజీలు పాల్గొన్నాయని అందులో ఎల్‌బీఆర్‌సీఈ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. టీమ్‌లోని వెంకన్న, హనుమనాయక్‌లు సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ పీడీలు ఎస్ దుర్గారెడ్డి, బేబీరాణిలను శ్రీనివాసరెడ్డి అభినందించారు.

బీఎల్‌ఓలతో సమీక్ష


మాట్లాడుతున్న తహశీల్దార్ సూర్యారావు

జగ్గయ్యపేట అర్బన్: కొత్త ఓట్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియను ఈనెల తొమ్మిదో తేదీలోగా పూర్తి చేయాలని జగ్గయ్యపేట తహశీల్దార్ ఎం.సూర్యారావు ఆదేశించారు. తన కార్యాలయంలో పేట మండలంలోని బీఎల్‌వోలతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో డబుల్ ఓట్లు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ దృష్టికి వచ్చిన డబుల్ ఓట్లలో అర్హతలేని ఓటును తొలగించాలని సూచించారు. అలాగే విదేశాలలో ఉన్న ఎన్‌ఆర్ఐ ఓట్లకు సంబంధించి కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ మిషన్(ఈవీఎం)ను ఉపయోగించడంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ మేరకు షెడ్యూల్ తయారుచేస్తామని వివరించారు. అర్హులందరికీ ఓటుహక్కు కల్పించేలా బీఎల్‌ఓలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల డీటీ కిషోర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

జుజ్జూరు(వీరులపాడు): ఓటరు నమోదు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహశీల్దార్ ఆశయ్యానాయక్ ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో ఓటరు నమోదు ప్రక్రియపై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్యానాయక్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ముఖ్యంగా కొత్త ఓట్ల నమోదును జాగ్రత్తగా పరిశీలించి ఓటుహక్కు కల్పించాలన్నారు. మృతిచెందిన, స్థానికంగా నివాసం ఉండనివారి ఓటును నిబంధనలకనుగుణంగా తొలగించాలని సూచించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువుబజారులో మార్కండేయస్వామి వారి దేవస్థానంలో విగ్రహాల ప్రతిష్టామహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ మేధా దక్షిణామూర్తి, కాలభైరవ, చండీశ్వర, కుమారస్వామి, అయ్యప్పస్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాల ప్రతిష్టను పురస్కరించుకుని స్థానిక స్పైల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. భక్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం(మైలవరం): ఇబ్రహీంపట్నంలో వేంచేసి ఉన్న శ్రీజగదాంబ అమ్మవారు(మోరామ తల్లి), సేవాలాల్ మహరాజ్, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ప్రతిష్ఠామహోత్సవంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని పూజలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మిర్చి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


గండేపల్లిలో మిర్చిపంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి నీలిమ, రైతులు

కంచికచర్ల : మిచాంగ్ తుపాను కారణంగా మండలంలోని గండేపల్లి, వేములపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న మిర్చితోటలను ఉద్యానశాఖ అధికారి వి.నీలిమ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా నీలిమ మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంతవరకు బయటకు పంపించాలని, వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పిచకారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే అంతరసేద్యం చేసి కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేలా చూసుకోవాలన్నారు. పొలంలో నీరు నిలిచి ఉంటే మిరప పంటకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3.0 గ్రాములు లేదా మెటాలాక్సిల్ ప్లస్ మాంకోజెట్ 2.0 గ్రాములను మొక్కల పాదుల్లో పోయాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, రైతులు ఉన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


కునికెనపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల మండలం కునికెనపాడులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును, సంక్షేమ పథకాలతో గ్రామస్తులకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయా పథకాల లబ్ధి వివరాలతో సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మరోసారి మోసం చేసేందుకు టీడీపీ నాయకులు చెబుతున్న కల్లబొల్లి మాటలను నమ్మవద్దన్నారు. అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవినీతిరహిత పాలన అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రం అన్నిరంగాల్లో మరింత అభివృద్ధిని సాధించేందుకు మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, నాయకులు రాయల నరసింహారావు, బుద్ధి సత్యనారాయణ, మంగిశెట్టి పుల్లారావు, మార్త శ్రీనివాసరావు, మండల పరిషత్ సూపరింటెంటెంట్ బాలశంకరరావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

అకాలవర్షం..అపార నష్టం


నందిగామ మండలం తక్కెళ్ళపాడులో తడిసిన వరిపంటను ఒడ్డుకు చేరుస్తున్న రైతులు


పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద వరద నీటిలో తేలుతున్న వరి పంట

నందిగామ: తుపాను రూపంలో వచ్చిన అకాల వర్షం అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చింది. వరి పంటలు కోతల దశలో ఉన్న సమయంలో తుపాను కారణంగా వీచిన ఈదురుగాలులకు పంట నేలకొరిగింది. అదే సమయంలో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నీటిపాలైంది. ఈ నేపథ్యంలో గురువారం సాధారణ వాతావరణం కనిపించడంతో అన్నదాతలు పంటలను రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

పొలాల్లోనే తడిసిన పత్తి..

నందిగామ నియోజకవర్గంలో ప్రధానంగా పత్తి, వరి పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంటలు 2, 3వ తీతల దశలో ఉంది. పలుచోట్ల తీతలకు సిద్ధంగా ఉన్న పత్తి వర్షానికి తడిసి ముద్దయింది. నియోజకవర్గంలో 33,675ఎకరాల్లో పత్తిసాగు చేపట్టగా, తీతదశలో ఉన్న 12వేల క్వింటాళ్ల మేర పత్తి తడిసి ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

పూర్తిగా తడిసిన ధాన్యం..

మూడురోజులపాటు కురిసిన వర్షాలకు పొలాలు ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి. వరిపంటను 19,650ఎకరాల్లో సాగుచేయగా, వర్షాలకు 14వేల ఎకరాల్లో పంట నీటమునిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో యంత్రాల ద్వారా హడావుడిగా వరి కోతలు చేపట్టిన రైతుల్లో కొంతమంది మాత్రమే ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకున్నారు. ఇక కల్లాల్లోనే ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రంగుమారిన ధ్యాన్యాన్ని చూసి రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. వరద నీరు తగ్గాక పూర్తిస్థాయిలో పంటనష్టం అంచనా వేసేందుకు అధికారులు సయామత్తమవుతున్నారు.

పొలాలను వీడని వరద నీరు

పెనుగంచిప్రోలు: తుపాను ప్రభావం తగ్గి వర్షాలు కురవడం ఆగినా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని పొలాల్లో వరద నీరు మాత్రం ఇంకా తగ్గలేదు. వాగుల్లో వరద నీరు ప్రవహిస్తుండటంతో పొలాల్లో వరద పోటెత్తింది. వరద నీరు ఇంకా పొలాల్లో నిలిచి ఉండటంతో నీటిని బయటికి పంపించేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. వరి కోతలు పూర్తయిన రైతులు వరద నీటిలో ఉన్న ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. వరదనీరు కారణంగా కొన్నిప్రాంతాల్లో రైతులు కూడా పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ విప్ ఉదయభానుతోపాటు ఏడీఏ సి.భవాని, రెవెన్యూ అధికారులు దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలిస్తూ ఆర్బీకేల ద్వారా పంట కొనుగోలు చేస్తామని రైతులకు ధైర్యం చెబుతున్నారు. వాగుల్లో నీటి ఉధృతి తోపాటు పొలాల్లో వరద నీరు తగ్గితేనే పూర్తిస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.


పల్లగిరి గ్రామంలో తుపానుకు తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు


ముచ్చింతాల వద్ద నీటిలో మునిగి ఉన్న వరి కంకులు

ఆదుకుంటారనే ధైర్యం ఉంది..



తుఫాన్ ప్రభావానికి వాగు పొంగడంతో నాతోపాటు నలుగురు రైతులకు చెందిన 80బస్తాల ధాన్యం తడిసింది. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, అధికారులు వచ్చి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. మమ్మల్ని జగనన్న ప్రభుత్వం ఆదుకుంటుందనే ధైర్యం ఉంది.

జంగం కాశేశ్వరరావు, పెనుగంచిప్రోలు రైతు

వరద తగ్గితే పూర్తి అంచనాలు..



పొలాల్లో వరద నీరు తగ్గిన వెంటనే సిబ్బంది పంటనష్టాన్ని పూర్తిగా లెక్కించి నివేదిక ఇస్తారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వరిపంట 18వేల ఎకరాల్లో సాగుచేయగా, 5వేల ఎకరాల్లో పంట నేలకొరిగింది. కొన్ని చోట్ల ధాన్యం తడిసింది. మిర్చి 22 వేల ఎకరాల్లో సాగు చేయగా 4వేల ఎకరాల్లో పాక్షికంగా నష్టం కలిగినట్లు అంచనా వేశాం. మొక్కజొన్నకు కూడా కొద్దిమేర నష్టం జరిగింది.

సి.భవాని, జగ్గయ్యపేట ఏడీఏ

ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కంచికచర్ల : భారత ప్రభుత్వం ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగ యువతీయువకులకు ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ సౌజన్యంతో 10వతరగతి ఉత్తీర్ణత కలిగి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపుగల నిరుద్యోగ యువతకు పాలిమర్స్ టెక్నాలజీలో మెషిన్ ఆపరేటింగ్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్‌తో పాటు అనంతపురం, బెంగుళూరు, మైసూర్, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్ వాటి అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. శిక్షణకు సంబంధించి పూర్తి సమాచారం కోసం 93985 35697ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు కవి సంధి వినూత్న సాహిత్య కార్యక్రమం

విజయవాడ కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 9 వ తేదీ శనివారం సాయంత్రం కవి సంధి పేరుతో వినూత్న సాహిత్య కార్యక్రమం జరుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కన్వీనర్ డాక్టర్ మృణాళిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో కవి ఖాదర్ మోహిద్దీన్‌తో ముఖాముఖి నిర్వహిస్తామని వివరించాం